క్లుప్తంగా

గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు గడువు పెంపు


చింతా శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం మండలంలోని ద్రాక్షారామలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఎస్సీ గురుకుల పాఠశాల/కళాశాలల్లో 5 వ తరగతి, ఇంటర్మీడియెట్లలో ప్రవేశాలకు దరఖాస్తుకు గడువు పెంచినట్లు ప్రిన్సిపాల్ చింతా శ్రీనివాసరావు శుక్రవారం విలేకరులకు తెలిపారు. 6వ తేదీగా ఉన్న గడువును ఈ నెల 13 వరకు పెంచినట్లు పేర్కొన్నారు. ఆన్‌లైన్ ద్వారా **httpr://apbrafcet.a pcfrr.in** లింక్ ఉపయోగించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం


నేలటూరులో అమ్మవారిని దర్శించుకుంటున్న చైర్‌పర్సన్

కపిలేశ్వరపురం: నేలటూరులోని విజయదుర్గమ్మ అమ్మవారిని మండపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూకదుర్గారాణి గురువారం దర్శించుకున్నారు. అమ్మవారి ఆలయ 14వ వార్షికోత్సవం సందర్భంగా గరగ నృత్యాలు, డప్పువాయిద్యాలుతో జాతర ఉత్సవం వైభవంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన ఆడపడుచులు అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ శనక్కాయల దొరబాబు, దుర్గాప్రసాద్, చిన్నరాజు, సూరిశెట్టి శ్రీనివాస్, బందారురాజు, గాజుల బాబీ, చీకట్ల దత్తుడు, తోట సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలి

మండపేట: కూటమి నేతలు ఎన్నికలకు ముందు సూపర్ సిక్స్ హామీలను వెంటనే అమలు చేయాలని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ మెంబర్ (సీడబ్ల్యూసీ) గిడుగు రుద్రరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండపేటలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 9 నెలలు పూర్తవుతున్నా ఎన్నికల హామీలు నెరవేర్చలేదన్నారు. ఎన్నికలకు ముందు అనేక హామీలు గుప్పించారని, ప్రస్తుత బడ్జెట్‌లో వాటి అమలుకు నిధులు కేటాయించలేదని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజల పక్షాల పోరాడుతుందన్నారు. మహిళలకు ఉచిత బస్ సౌకర్యం , ప్రతి మహిళకు రూ.1500, నిరుద్యోగులకు భృతి తదితర హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. తొలుత అనారోగ్యంతో బాధపడుతున్న పట్టణానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నేత శివకోటి శేషసుబ్రహ్మణ్యాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో పీసీసీ ఉపాధ్యక్షుడు కొత్తూరి శ్రీనివాస్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద తయారీపై శిక్షణ

రామచంద్రపురం రూరల్: మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, పారిశుధ్య సిబ్బంది, మండల డ్వాక్రా యానిమేటర్లకు చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల ఆవశ్యకత, నిర్వహణ తదితర అంశాలపై ఒక్కరోజు శిక్షణ నిర్వహించారు. సర్పంచ్ వీరబోయిన సూరిబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీడీఓ కడలి పద్మజ్యోతి, ఈఓపీఆర్డీ ఎస్.సెలత్ రాజు, ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ జేఈ మోర్త ఈశ్వరరావు, జిల్లా రిసోర్సుపర్సన్ లావణ్యలు శిక్షణ అందజేశారు. ఎంపీడీఓ పద్మజ్యోతి మాట్లాడుతూ గ్రామాలన్నీ పరిశుభ్రంగా, చెత్త రహితంగా ఉండడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో ప్రజలకు తడి, పొడి చెత్త నిర్వహణపై అవగాహన కల్పించాలని, ప్రతి ఇంటి నుంచి క్లాప్ మిత్రల ద్వారా తడి చెత్త, పొడి చెత్త వేర్వేరుగా సేకరించి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలకు చేర్చడం, తద్వారా సంపద సృష్టించి పంచాయతీల ఆదాయం పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. దీనికి గాను ప్రజల నుంచి పూర్తి స్థాయిలో సహకారం లభించేలా ప్రజాప్రతినిధులను కలుపుకుని సమష్టిగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ పిల్లి సూర్యప్రకాశరావు, ఉప సర్పంచ్ అన్యం వెంకన్న, మాజీ సర్పంచ్ వట్టికూటి ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

మండపేట: నియోజకవర్గంలో పలువురు బాధితులకు సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు శుక్రవారం పంపిణీ చేశారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో 30 మంది బాధితులకు రూ.24,51,402 విలువైన చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మలసాని సీతామహలక్ష్మి, మద్దాల శ్రీనివాస్, గుణ్ణ శ్రీను, బాధితులు పాల్గొన్నారు.

నారి.. చైతన్యఝరి



- సేవకు ప్రతిరూపం..ఆమె
- అన్ని రంగాల్లోనూ దూసుకుపోతున్న అతివలు
- నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం



రాయవరం: ఆమె..చైతన్యఝరి. నవ్వితే అందం.. ఇంటిల్లిపాదికీ ఆనందం. లక్ష్మీరూపిణిగా ఓ ప్రత్యేక స్థానం. అమ్మగా..అక్కగా..చెల్లిగా..అడుగడుగునా ఆత్మీయత పంచే అద్భుతమూర్తిగా ఆమెది ప్రత్యేక స్థానం. ఓర్పు..నేర్పు ఆమె సొంతం. ఆగ్రహిస్తే ఆది పరాశక్తిగా అనంత విశ్వాన్నీ కదిలించగల బలశాలి. అందుకే ఆమెకు సలాం. ఎన్ని కష్టాలొచ్చినా వెనుకడుగు వేయని కొందరు..జీవితమనే సంద్రంలో విజయం తీరం చేరిన మరికొందరు. ఇలా దైనందిన వృత్తిని, జీవితాన్ని సమన్వయం చేసుకుంటూ సమర్థంగా ముందుకెళ్తున్నారు పలువురు మహిళలు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పలువురి అక్కచెల్లెమ్మలు తమ అభిప్రాయాలను 'సాక్షి'తో పంచుకున్నారు.

వివక్ష కొనసాగుతోంది



సమాజంలో పురుషులతో సమానంగా స్త్రీలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. అయినప్పటికీ మహిళల్లో వివక్ష కొనసాగుతూనే ఉంది. మహిళల్లో మరింత చైతన్యం పెరగాల్సిన అవసరం ఉంది. బాలికా విద్య మరింత పెరగాలి. ప్రతీ మహిళ ఉన్నత చదువులు చదివినప్పుడే సమాజం మరింతగా అభివృద్ధి చెందడానికి అవకాశం ఉంటుంది.

– డి.ఆదిలక్ష్మి, సీఐటీయూ మండల కన్వీనర్, రాయవరం

ఆర్థిక స్వావలంబన సాధించాలి



ప్రతి మహిళ ఆర్థికంగా స్వావలంబన సాధించాలి. అప్పుడే ప్రతి మహిళ అభిప్రాయానికి విలువ దక్కుతుంది. అలాగే పురుషుల్లో కూడా మహిళలను అభివృద్ధి చేయాలనే అభ్యుదయ భావాలు ఉన్నప్పుడే మహిళా సాధికారికత సాధ్యమవుతుంది. ఉద్యోగిని అయినా, గృహిణి అయినా వారికి భర్తలు బాసటగా నిలవాలి.

– ఎ.నాగసత్యవేణి, మండల పశువైద్యాధికారి, చెల్లూరు, రాయవరం మండలం

అన్ని రంగాల్లో రాణించాలి



అతివలు అన్ని రంగాల్లో రాణించడంతో పాటు సమగ్రాభివృద్ధి చెందినప్పుడే మహిళా సాధికారిత సాధ్యమవుతుంది. విద్యాపరంగా, వైద్యపరంగా, సమాజపరంగా, ఆర్థికంగా మహిళలు ఎదగాల్సిన అవసరం ఉంది.

– డాక్టర్ సీహెచ్ రమ్య, పీహెచ్‌సీ వైద్యాధికారి, రాయవరం

రిజర్వేషన్లు అమలు చేయాలి



ప్రకటనలు, చర్చల్లో కాకుండా మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కచ్చితంగా అమలు చేయాలి. అలా అమలు జరిగితే అన్ని రంగాల్లో మహిళామణులు ఉన్నత స్థానాలను అధిరోహిస్తారు. మరింత స్వేచ్ఛ, అభివృద్ధి మహిళలకు లభిస్తాయి.

– ఎం.శ్రీదేవి, జిల్లా అధ్యక్షురాలు, ఉమ్మడి జిల్లా యానిమేటర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు, వెదురుపాక, రాయవరం మండలం

సామాజిక స్పృహ పెంచుకోవాలి



మహిళలు విద్యాపరంగా ఎంతగా రాణించినా సామాజిక స్పృహను తగినంతగా పెంచుకోలేకపోతున్నారు. విద్య కేవలం ఉద్యోగం సాధనకే కాదన్న విషయం గుర్తుంచుకోవాలి. జనాభాలో సగం అంటున్న మహిళలు దేశాభివృద్ధికి కూడా అదే నిష్పత్తిలో భాగస్వాములు కావాలి.

– ఎస్.కీర్తి స్పందన, ఎంపీడీవో, రాయవరం

లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా జడ్జి శంకరరావు

రామచంద్రపురం: స్థానిక కోర్టుల ప్రాంగణంలో నేడు నిర్వహిస్తున్న జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని, మండల లీగల్ సెల్ కమిటీ చైర్మన్ 13వ అదనపు జిల్లా జడ్జి ఎం.శంకరరావు సూచించారు. కోర్టుల ప్రాంగణంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజీయే రాజమార్గమని, అందరూ గుర్తించాలన్నారు. క్షణికావేశంలో కేసులు పెట్టుకున్న కక్షిదారులు లోక్‌అదాలత్ ద్వారా కేసులు పరిష్కారం చేసుకోవచ్చన్నారు. కక్షిదారులు ఇరువురు ఆమోదయోగ్యమైన పరిష్కారం లోక్ అదాలత్‌లో లభిస్తుందని చెప్పారు. రాజీపడదగ్గ సివిల్, క్రిమినల్, చెక్‌బౌన్స్, మోటారు వాహన ప్రమాదాల కేసులు, కుటుంబ తగాదాలు, బ్యాంకులు, బీమా సంస్థల కేసులు జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరించుకునే వీలుందన్నారు. సత్వర న్యాయం పొందడానికి లోక్ అదాలత్‌లు మంచి మార్గమన్నారు.

ఇంటర్ పరీక్షలకు 145 మంది హాజరు

రాయవరం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం జరిగిన ఇంటర్ సెకండియర్ పరీక్షలకు 145 మంది విద్యార్థులు హాజరయ్యారు. సెకండియర్ గణితం పరీక్షకు 75 మంది, బోటనీ పరీక్షలకు 39, సివిక్స్ పరీక్షలకు 31 మంది హాజరయ్యారు. గణితం పరీక్షకు ఇద్దరు, సివిక్స్ పరీక్షకు నలుగురు గైర్హాజరైనట్లు పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ డీవీవీ నాగేశ్వర రెడ్డి తెలిపారు.

విలువలతో కూడిన విద్య అందించాలి


విద్యార్థులలతో ముచ్చటిస్తున్న డీఈవో సలీంబాషా

రామచంద్రపురం: ప్రతి పాఠశాలలో విలువలతో కూడిన విద్యను నేటి తరానికి అందించాల్సిన ఆవశ్యకత ఉందని, అందులో భాగంగా మోడరన్ విద్యా సంస్థలు నిత్యం కృషి చేయడం అభినందనీయమని జిల్లా విద్యాశాఖాధికారి(డీఈవో) డాక్టర్ షేక్ సలీం అన్నారు. పట్టణంలోని ముచ్చిమల్లి రోడ్డులోని మోడరన్ ఏబీసీ ప్రైమరీ స్కూల్ వార్షికోత్సవ కార్యక్రమం స్థానిక లయన్స్ కల్యాణ మండపంలో శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి డీఈవో షేక్ సలీం బాషా ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. తొలుత పాఠశాలలోని విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించి వారితో ముచ్చటించారు. అనంతరం డీవైఈవో రామలక్ష్మణమూర్తి, ఎంఈఓ కె.వీరరాఘవరెడ్డి తదితరులు మాట్లాడారు. విద్యార్థులు ప్రదర్శించిన కరాటే విన్యాసాలను రామచంద్రపురం సీఐ వెంకటనారాయణ, అడిషనల్ ఎస్సై భుజంగరావు అభినందించారు. సీఐ మాట్లాడుతూ చిన్ననాటి నుంచి విద్యార్థులకు, విద్యతో పాటుగా మార్షల్ ఆర్ట్స్ నేర్పించడం అభినందనీయమన్నారు. మోడరన్ విద్యా సంస్థల అధినేత జీవీరావు ఏబీసీ ప్రైమరీ అకడమిక్ డైరెక్టర్ ఎ.రమాదేవి, డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ పి.వెంకటేశ్వర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పన్నుల వసూళ్లకు ప్రత్యేక బృందాలు


ఆర్పీలకు పన్ను వసూళ్లపై సూచనలు చేస్తున్న కమిషనర్ రంగారావు

మండపేట: పన్నుల వసూళ్లకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్టు మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తిపన్నులను పట్టణ ప్రజలు సకాలంలో చెల్లించి పురపాలక సంఘానికి సహకరించాలని కోరారు. స్థానిక పురపాలక సంఘం కార్యాలయంలో శుక్రవారం ఆర్పీలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ నెలాఖరుకు నూరుశాతం పన్నులు వసూలు చేసి జిల్లాలోనే మొదటి స్థానంలో మండపేట మున్సిపాలిటీని నిలిపేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ మేరకు మెప్మా ఆర్పీలు, సచివాలయ సిబ్బంది, కార్యాలయ సిబ్బందిని టీమ్‌లుగా నియమించామన్నారు. వారు పట్టణంలోని ప్రతి ఇంటికి వెళ్లి పన్నులు వసూలు చేస్తారని తెలిపారు. అనంతరం వార్డుల్లో పర్యటించి పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు. మెయిన్‌రోడ్డులో జయలక్ష్మి బిర్యానీ పాయింట్ వద్ద అపరిశుభ్ర వాతావరణం ఉండడంతో రూ.1000 అపరాధ రుసుము విధించారు. ధర్మగుండం, గొల్లపుంత కాలనీ, వీరభద్రపురం, విజయలక్ష్మి నగర్, గొల్లలగుంట సెయింట్ ఆన్స్ పరిసర ప్రాంతాల్లో పర్యటించి ప్రజల నుంచి పన్నులు కట్టించుకున్నారు. కార్యక్రమంలో ఆర్వో జేవీఎస్ శాస్త్రి, డీఈ కె.శ్రీనివాస్, ఏఈలు పవన్‌కుమార్, ఆంజనేయులు, టీపీవో శ్రీరమ్య, ఆర్ఐ అందే శ్రీనివాస్, ఉప్పల శ్రీనివాస్, ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ముత్యాల సత్తిరాజు, ఆర్పీలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

రామచంద్రపురం: స్థానిక కృత్తివెంటి పేర్రాజు పంతులు డిగ్రీ కళాశాలలో శుక్రవారం మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా డాక్టర్ కవిత పాల్గొని మహిళా దినోత్సవ విశిష్టతను తెలిపారు. మహిళలు తప్పనిసరిగా విద్యనభ్యసించి ఉన్నత స్థాయిలో ఉండేందుకు కృషి చేయాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బాల్య వివాహాలు చేసుకోకూడదని, న్యూట్రిషన్ ఫుడ్ తీసుకుంటూ ఆరోగ్యంగా ఉండాలన్నారు. కళాశాలలోని మహిళా ఉద్యోగినులకు, విద్యార్థినులకు వివిధ పోటీలను నిర్వహించారు. మెహందీ పోటీల్లో విద్యార్థినులు తమ ప్రతిభను కనబర్చారు. సంప్రదాయ వస్త్రధారణ పోటీలు నిర్వహించి అనంతరం విద్యార్థులు తమ ఉపాధ్యాయులను సత్కరించారు.

అంగన్‌వాడీ వర్కర్ల 2కే రన్

రాయవరం: మండలంలోని చెల్లూరులో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం 2కే రన్ నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సునీత, విష్ణుకుమారి ఆధ్వర్యంలో అంగన్‌వాడీ వర్కర్లు, స్థానిక మహిళలు కలిసి 2కే రన్ చేపట్టారు. పసలపూడి వంతెన వద్ద నుంచి కృష్ణమ్మ చెరువు వరకు పరుగు పెట్టారు. మండపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో ఎ.గజలక్ష్మి ఆదేశాల మేరకు 2కే రన్ చేపట్టినట్లు సూపర్‌వైజర్లు సునీత, విష్ణుకుమారి తెలిపారు. మహిళా సాధికారిత, లింగ వివక్ష నివారణ, మహిళలకు సమాన గౌరవం కల్పించడం వంటి లక్ష్యాలతో 2కే రన్ చేశామన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు మాణిక్యం, వెంకటలక్ష్మి, శ్రీదేవి, సింహాచలం, అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాల సంఘం ప్రాజెక్టు వర్కింగ్ కమిటీ అధ్యక్షురాలు డి.ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం

రాయవరం: మండలంలోని వెదురుపాకలో యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. డ్వాక్రా మహిళలు, మహిళా ఉద్యోగుల సమక్షంలో కేక్ కట్ చేశారు. బ్యాంకు మేనేజరు లొల్ల మహేష్ మాట్లాడుతూ మహిళా దినోత్సవం ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో స్థానిక నేత దంతుర్తి గోపాలకృష్ణ, అసిస్టెంట్ మేనేజర్ కె.నాగబాబు, క్యాషియర్ టి.శ్రీధర్‌రెడ్డి, సీఎస్‌పీ బి.శ్రావని, సబ్ స్టాఫ్ బీవీవీఎస్ ప్రసాద్, యానిమేటర్లు ఎం.శ్రీదేవి, వి.నాగమణి, సీహెచ్.ప్రసన్న, టి.కాంతకుమారి, జి.సత్యవేణి తదితరులు పాల్గొన్నారు.



చెల్లూరులో 2కే రన్ చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, సూపర్‌వైజర్లు


వెదురుపాక యూనియన్ బ్యాంకులో కేక్ కట్ చేస్తున్న మహిళలు

రొయ్యల రోదన


కాజులూరులో వైట్ స్పాట్‌తో చనిపోతుండటంతో రొయ్యలను పట్టుబడి చేస్తున్న రైతులు

- ఆక్వా ధర పతనం, రైతుల గగ్గోలు
- వ్యాధులతో చనిపోతున్న రొయ్యలు
- తక్కువ కౌంట్‌లోనే తప్పని పట్టుబడి
- అదను చూసుకుని ధర తగ్గించిన కంపెనీలు


రొయ్యల ధరలు నెల రోజుల క్రితం, ప్రస్తుతం ధరలకు వ్యత్యాసం ఇలా..

కౌంట్	ప్రస్తుతం ధర	నెలరోజుల క్రితం
100	210	270
90	220	280
80	240	300
70	270	330
60	310	360
50	340	390
40	370	415
35	380	425
30	440	475


పట్టుబడి చేసిన 100 కౌంట్ రొయ్యలు

కాజులూరు: విదేశీ మారక ద్రవ్యాన్ని భారీగా ఆర్జించిపెట్టే ఆక్వా రంగం క్రమేపీ కుదేలౌతుంది. నాణ్యత లేని సీడు, రోజురోజుకూ ఆకాశానంటుతున్న మందులు, మేత ధరలతో పెట్టుబడులు పెరుగుతుండగా వ్యయాలకు తగ్గట్టు ఉత్పత్తి అయిన రొయ్యలకు సరైన ఆదాయం లభించకపోవటంతో ఆక్వా రైతులు నష్టాల ఊబిలో కూరుకుపోతున్నారు. దీనికి తోడు పట్టుబడులు జరిగి మార్కెట్లోకి సరకు ఎక్కువగా వచ్చే సమయంలో ఎగుమతిదారులు సిండికేట్‌గా మారి ధరలు అమాంతంగా తగ్గించి వేస్తుండటంతో రైతులు కుదేలవుతున్నారు. ఇటీవల రాత్రి చలి, పగటిపూట వేడి వాతావరణ మార్పులతో ఆక్వాసాగు సాగు ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటుంది. చెరువులలో డీఓ (డిజాల్వ్‌డ్ ఆక్సిజన్) లెవెల్స్‌లో హెచ్చుతగ్గులు జరిగి గత 15 రోజుల నుంచి వైట్ స్పాట్ వంటి వ్యాధులు సోకుతుండటంతో చెరువుల్లోని రొయ్యలు తేలిపోతున్నాయి. దీంతో 100, 90, 80 వంటి తక్కువ కౌంట్‌లోనే రైతులు పట్టుబడి పట్టాల్సి వస్తోంది. దీనిని అదనుగా చూసుకుని కంపెనీలు అమాంతం ధర తగ్గించేశాయి. గత నెల రోజుల క్రితం 100 కౌంట్ ధర రూ.270 కి కొనుగోలు చేశారు. మహాశివరాత్రి పండగ పేరుచెప్పి రొయ్యల కొనుగోలు తగ్గించిన వ్యాపారులు క్రమేపీ ధర తగ్గించుకుంటూ వచ్చారు. ప్రస్తుతం రూ.210 మించి కంపెనీలు కొనుగోలు చేయడం లేదు. దానికి తోడు పట్టుబడి పట్టిన రొయ్యలు పీలింగ్, గుళ్ళకొట్టులో ఉన్నాయంటూ నాణ్యత లోపం పేరుతో మరికొంత కోత విధిస్తున్నారు. దీంతో ఎకరం చెరువులో సగటున రెండు టన్నుల దిగుబడి వస్తే కేజీకి రూ.60 చొప్పున రూ.లక్షా 20 వేల వరకూ రైతు నష్టపోవలసి వస్తుంది. తగ్గిపోయిన ధర రూపంలో తమ కష్టార్జితమంతా కోల్పోతున్నామని రైతులు వాపోతున్నారు. వాతావరణ మార్పులతో వైట్‌స్పాట్, రెడ్‌గ్రిల్ వంటి వ్యాధులు సోకి రొయ్యలు చనిపోతుండటంతో అందరూ ఒకేసారి పట్టుబడి పట్టాల్సి వస్తోందని, సరఫరా పెరగడంతో కంపెనీలు అదను చూసుకుని ధర తగ్గించారని పలువురు నిపుణులు అంటున్నారు. అంతర్జాతీయ స్థాయిలో ఎగుమతులు జరిగే ఆక్వామార్కెట్‌కు ఆ స్థాయిలో డిమాండ్, ద్రవ్యోల్బణం, ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా ధరలు హెచ్చుతగ్గులు ఉంటాయని అయితే స్థానిక కంపెనీలన్నీ సిండికేటుగా మారి సరకు ఎక్కువగా వచ్చే సమయానికి ధరలను తగ్గించేస్తున్నారని పలువురు రైతులు వాపోతున్నారు. మేతలు, మందుల ధరలు రోజురోజుకీ పెరిగిపోతుండగా రొయ్యల ధరలు పట్టుబడి పట్టే సమయానికి తగ్గిపోతుండటంతో తీవ్రంగా నష్టపోతున్నామని ప్రభుత్వం కంపెనీలపై అజమాయిషీ ఉంచి ధరలను స్థిరీకరించాలని రైతులు కోరుతున్నారు.


ధరలు తగ్గించేస్తున్నారు



రైతుల నుంచి ఒకేసారి సరకు వస్తుంటే కంపెనీలన్నీ ఏకమై ధర తగ్గించేస్తున్నారు. వ్యాధుల బారిన పడి చెరువుల్లో రొయ్యలు తెలిపోతుండటంతో తక్కువ కౌంట్‌లోనే పట్టుబడి పట్టవలసి వస్తుంది. రొయ్య కేజీ 150 కౌంట్ కంటే చిన్నదిగా ఉంటే కంపెనీలు కొనడం లేదు.

– యాళ్ల సత్యనారాయణ, ఆక్వా రైతు, కాజులూరు

భవిష్యత్తులో సాగు కష్టమే



మేత, ఇతర ఖర్చులు పెరుగుతుంటే రొయ్యల ధరలు మాత్రం తగ్గుతున్నాయి. పైగా పంట చేతికొచ్చే సమయంలో రొయ్యల ధరలు పడిపోతున్నాయి. దీంతో నికర ఆదాయం తగ్గి రైతులు నష్టాలబాట పడుతున్నారు. పరిస్థితి ఇలా ఉంటే భవిష్యత్తులో ఆక్వా సాగు ప్రశ్నార్థకమే.

– వీరవల్లి గణపతి, ఆక్వా ట్రైనీ టెక్నీషియన్, గొల్లపాలెం

రోడ్డు ప్రమాదంలో స్కూటరిస్టుకు గాయాలు

కాజులూరు: మండలంలోని గొల్లపాలెం, కుయ్యేరు రహదారిలో చేదువాడ వంతెన వద్ద శుక్రవారం ఒక స్కూటరిస్టు అదుపుతప్పి తీవ్ర గాయాల పాలయ్యాడు. ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కాకినాడ జగన్నాథపురానికి చెందిన బద్దెలపాటి రాజారావు తన స్కూటరుపై కాజులూరు వచ్చి తిరిగి వెళుతున్నాడు. చేదువాడలో రోడ్డు నిర్మాణం పనులు జరుగుతుండగా స్కూటరు అదుపుతప్పి రోడ్డుపక్కన ఉన్న గోతిలో పడ్డాడు. ఈ సంఘటనలో రాజారావు గాయాల పాలవగా స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం గొల్లపాలెంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనపై ప్రత్యేక డ్రైవ్

అయినవిల్లి: మండలంలో జిల్లా బాలల పరిరక్షణ యూనిట్, జిల్లా చైల్డ్ లేబర్ ఆఫీస్ ఆధ్వర్యంలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై శుక్రవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహిచారు. మండలంలో ముక్తేశ్వరం, అయినవిల్లి తదితర గ్రామాల్లో టిఫిన్, భోజనం హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీలు, బట్టల షాపులు, ఇటుకబట్టీలు మొదలైన దుకాణాల్లో బాల కార్మిక వ్యవస్థ గురించి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ డ్రైవ్‌లో లేబర్ ఆఫీసర్ ఎ.విజయప్రకాష్ మాట్లాడుతూ చిన్న పిల్లలను అనగా 14 ఏళ్ల లోబడి ఉన్న వారిని మీ షాపుల్లో పనికి పెట్టుకోకూడదని, అలా పెట్టుకున్నట్టయితే బాలల హక్కుల రక్షణపై ప్రభుత్వం తీసుకునే చర్యలకు మీరు బాధ్యులవుతారన్నారు. ప్రతి షాపులో లేబర్ సర్టిఫికెట్లు డిస్‌ప్లే చేయాలని వారికి అవగాహన కల్పించారు. ఫ్లెక్సీతో ముక్తేశ్వరం సెంటర్‌లో అధికారులు అవగాహన కల్పించారు. ఈ ప్రత్యేక డ్రైవ్‌లో రాయవరం అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ పీఎస్ కార్తీక్, జిల్లా బాలల పరిరక్షణ విభాగం సిబ్బంది ఎం.మహాలక్ష్మిణ్, మండల విద్యాధికారి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.